

డీసీసీ బ్యాంకు మహాజన సభలో మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు

రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- వాణిజ్య బ్యాంకులకు దీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

7



పాండురంగారావు

ఉమ్మడి జిల్లా నుంచి..
ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

- ఎక్సలెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు

7



దీప్తి

- గర్జించిన గొంతులు.. మార్మోగిన డప్పులు..



వేయిస్తంభాల గుడి వద్ద డప్పు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మందకృష్ణ మాదిగ, చిత్రంలో ఎమ్మెల్సీ మల్లన్న, అరూరి రమేష్, తదితరులు

కమిటీల పేరుతో కాంగ్రెస్ కాలయాపన

- మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు
- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

7



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ



వేయిస్తంభాల ఆలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ శ్రేణులు

అందరి చూపు.. 'గురుకులం' వైపు..



కేసముద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల

కేసముద్రం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన, బల హీనవర్గాల్లో ప్రతిభావంతులైన నిరుపేద పిల్లల్లోని ప్రతిభను వెలికితీస్తూ.. వారి బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ గురుకుల పాఠశాలలు బాటలు వేస్తున్నాయి. ఆయా వర్గాల పిల్లలకు ఉచితంగా ఆంగ్లమాధ్యమంలో విద్యనందించడమే లక్ష్యంగా కేజీ టు పీజీ విద్య మిషన్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా దళిత, గిరిజన, వెను కబడిన తరగతుల (ఎస్సీ, ఎస్టీ, బీసీ) తో పాటు మైనార్టీ, ఆర్థికంగా వెనుకబ డిన తరగతుల (ఈడబ్ల్యూఎస్) వి ద్యార్థులకు భవిష్యత్తును తీర్చిది ద్దేందుకు 2017 జూన్‌లో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగ తుల సం క్షేమ శాఖల ఆధ్వర్యంలోని గురు కుల పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో 2025-2026 విద్యాసంవత్సరానికి ఐదో తర గతి ఆంగ్లమాధ్యమంలో ప్రవేశం కోసం నిర్వహించే '5టీజీ సెట్-2025' (5వ తరగతి తెలంగాణ గురు కుల ఉమ్మడి ప్రవేశపరీక్ష- 2025)కు బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వాని స్తోంది. ఇదే నోటిఫికేషన్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు అన్నిరకాల గురుకులాల్లో మిగిలిన (బ్యాక్‌లాగ్) సీట్ల భర్తీని చేపడు తున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించ లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకు లాల్లో చేర్పించేందుకు ఏటా అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. గురుకులాల్లో ఎలాగైనా సీటు సంపాదించాలని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటుగా ప్రత్యేక శిక్షణకు సైతం పంపిస్తుండడం గమనార్హం. సీటువస్తే 5వ తరగతి నుంచి ఇంటర్మీడి యట్ వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యతో పాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా ప్రవేశ పరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

- 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచిత వసతి, విద్య
- ప్రవేశం కోసం '5టీజీ సెట్-2025' నిర్వహణ
- ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి 'కులం, ఆదాయం' కూడా అవసరమే
- 6నుంచి 9వ తరగతి బ్యాక్‌లాగ్ ఖాళీలకూ ఎంట్రెన్స్

గురుకులాల ప్రత్యేకతలివే..

- సుదీర్ఘ అనుభవం గల ఉపాధ్యాయులతో ఇంగ్లీష్ మీడియంలో బోధన.
- విద్యార్థులపై 24 గంటలు ఉపాధ్యాయుల పర్యవేక్షణ.
- ఉత్తమ ర్యాంకులతో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్ వంటి జాతీయస్థాయి పోటీ పరీక్షలకు నిపుణులతో శిక్షణ.
- అత్యధిక సంఖ్యలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ లలో ప్రవేశాలు పొందేలా ఉత్తమ శిక్షణ.
- సెంట్రల్, అజీమ్‌ప్రేమ్‌జీ, ఢిల్లీ యూనివర్సిటీల వంటి టీఐఎస్ఎస్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి ఉత్తమ శిక్షణ.
- విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు హౌస్ మాస్టర్, హౌస్ పేరెంట్ వ్యవస్థ.
- పాఠ్యాంశాలతోపాటు సహ పాఠ్యాంశాలు, క్రీడలు తదితర వాటిపై ప్రత్యేక శ్రద్ధ.
- యోగ, శారీరక విద్య, మార్షల్ ఆర్ట్స్ లలో శిక్షణ.
- తరగతి గదిలో చదువుతో పాటు క్షేత్రపర్యటన, తోటి విద్యార్థులు, ప్రయోగశాలల ద్వారా చదువుకునే అవకాశం కల్పించడం.
- చదువుతో పాటు సహ పాఠ్యాంశాలు, క్రీడలు, లలితకళలు, వైజ్ఞానిక ప్రదర్శనలు, యూత్ పార్లమెంటు వంటి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం.

ఉచిత సౌకర్యాలు..

- సన్నబియ్యంతో పాటు మటన్, చికెన్, కోడిగుడ్లు, అరటిపండ్లు వంటి అన్ని పోషక విలువలతో కూడిన చక్కటి రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తారు.
- విద్యార్థుల స్టేషనరీ (పెన్నులు, పెన్సిళ్లు, రికార్డు పుస్తకాలు) పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తారు.
- మూడు జతల స్కూల్ యూనిఫాంలు, ట్రంక్ బాక్సులు అందజేస్తారు.
- ఫిజికల్ ట్రైనింగ్ డ్రెస్, ట్రాక్ సూట్, స్పోర్ట్స్ షూ, ఇతర సౌకర్యాలను కల్పిస్తారు.
- ప్రతీ విద్యార్థికి ప్లేట్, గ్లాస్, బెడ్‌షీట్, పరుపులు, దిండ్లు, బ్లాంకెట్, ట్రంక్‌బాక్స్‌లను అందజేస్తారు.
- హెల్త్‌కిట్ ద్వారా కాస్మెటిక్స్ వస్తువులు, ప్రతీ విద్యార్థికి సబ్బుల కొనుగోలు కోసం డబ్బులను పంపిణీ చేస్తారు.

4వ తరగతి చదివే వారే అర్హులు...

ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతూ ఉండాలి. ఓసీ, బీసీ విద్యార్థులైతే 01-09-2014 నుంచి, ఎస్సీ, ఎస్టీలైతే 01-09-2012 నుంచి 31-08-2016 మధ్య తేదీల్లో జన్మించి ఉండాలి. విద్యార్థుల తల్లిదండ్రులకు 2024-25 ఆర్థిక సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో

మిగతా 8వ పేజీలో...

స్టాంప్ డ్యూటీ నిధుల వినియోగానికి
అనుమతివ్వాలి

సీడీఎంఏ శ్రీదేవికి మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ విజ్ఞప్తి



హైదరాబాద్‌లో టీకే శ్రీదేవికి వినతి పత్రాన్ని అందిస్తున్న మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మునిసిపాలిటీకి స్టాంప్ డ్యూటీ నిధులు రూ.10.53 కోట్లు విడుదల అయ్యాయని, అత్యవసర పనుల కోసం స్టాంప్ డ్యూటీ నిధులు వినియోగించుకునేలా నిబంధనలు సడలించి అనుమతి ఇవ్వాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కమిషనర్ అండ్ డైరెక్టర్ టీకే. శ్రీదేవికి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. అనంతరం స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేసిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహబూబాబాద్ మునిసిపాలిటీలో గత ఆరు నెలలుగా నిధుల కొరతతో వర్కర్లకు వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ, విద్యుత్ చార్జీలు, నీటి పరఫరా మెయింటెనెన్స్, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులు మొదలగు అత్యవసర పనులు చేపట్టేందుకు ఇబ్బంది కర పరిస్థితులున్నాయని చెప్పారు. స్టాంప్‌డ్యూటీ నిధుల మంజూరీతో మునిసిపల్ వర్కర్ల వేతనాలు, కరెంటు చార్జీలు, నీటి సరఫరా, పారిశుధ్య నిర్వాహణ, అత్యవసర పనులు చేపట్టేందుకు అలాగే మునిసిపల్ సాధారణ నిధులు సరిపడా లేనందున నీటి సరఫరా మరమ్మ త్తుల సామాగ్రి కొనుగోలు, ఆలం, బ్లీచింగ్ కొనుగోలు, మోటార్ల రిపేర్, వాహనాల డిజిల్ వినియోగం మొదలగు రోజు వారీ అత్యవసర పనులు చేపట్టేందుకు కూడ అవసరం ఉన్నందున వాటి కోసం నిధులను ఖర్చు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరామని చెప్పారు. అదే విధంగా పట్టణం శివార్లలో ప్రభుత్వ భూముల్లో నివాస గృహాలు నిర్మించుకున్న వారికి అన్ని మౌళిక వసతులు కల్పిస్తున్నామని, ఆస్తి, నల్లా పన్ను వసూలుకు ఇంటి నెంబర్లు కేటాయించకపోవడంతో మునిసిపాలిటీకి ప్రతి ఏటా రూ.2 కోట్లకు పైగా నష్టం జరుగుతుందని వారికి ఇంటి నెంబర్లు కేటాయించి మునిసిపల్ ఆదాయాన్ని పెంచాలని కోరినట్లు తెలిపారు.



డీఎంహెచ్‌వో మురళీధర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సీఐటీయూ నేతలు, ఆశా వర్కర్లు

సమస్యల పరిష్కారానికి
పాదయాత్ర

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని, ఆశా వర్కర్లకు నెలకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కురవి మండల కేంద్రం నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా వైద్యాధికారి మురళీధర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.... ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వెట్టిచాకిరి చేయిస్తూ శ్రమ దోపిడికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కురవి నుంచి కలెక్టరేట్ వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తోట శ్రీను, మల్లయ్య, వెంకన్న, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు సుజిత, కాశేశ్వరీ, నిర్మల, హేమలత పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో జనవరి 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలను ఖచ్చితంగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకాలపై ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామ సభల నిర్వాహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎక్కడా నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులంతా అత్యంత జాగ్రత్తగా గ్రామ సభల నిర్వహణ ప్రక్రియను



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

సజావుగా నిర్వహించాలని చెప్పారు. అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులపై అర్హుల జాబితాను ప్రదర్శించాలని, గ్రామ సభల్లో వచ్చే ఫిర్యాదులపై రిజిస్టర్లలో నమోదు చేసి, అర్జీలను స్వీకరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. గ్రామ సభల తీర్మాణ ప్రతులను జాగ్రత్తగా భద్రపర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పొ, కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదన్ రాజు, హరిప్రసాద్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

మహబూబాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జాతీయ పతాకావిష్కరణ, పోలీసు గౌరవ వందనం, పరేడ్ కార్యక్రమాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ మునిసిపల్ కమిషనర్, వేదిక అలంకరణ ఉద్యాన శాఖ అధికారి, ముఖ్య అతిథులకు ఆహ్వానపత్రాలు అందించడం, ఉత్తమసేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు.

జాతీయ భావం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆ బాధ్యతను విద్యాశాఖ అధికారులు తీసుకోవాలన్నారు. గణతంత్ర వేడుకలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారికి సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పొ, కె.వీరబ్రహ్మచారి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతిరావు, జిల్లా అధికారులు పురుషోత్తం, సుబ్బారావు, మురళీధర్, మరియన్న, ప్రేమ్ కుమార్, బీమ్లానాయక్, డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.



సభలో యూనియన్ నేతల అభివాదం

మునిసిపల్ వర్కర్స్ యూనియన్
రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

మహబూబాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పేరాల కట్టయ్య భవనంలో ఆదివారం జరిగిన తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్ యూనియన్ రెండో మహాసభ అనంతరం రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాష్ట్ర అధ్యక్షులుగా కె.సూర్యం(హైదరాబాద్), ఉపాధ్యక్షులుగా దున్న గురువయ్య, (ఖమ్మం), కొలిమి రాములు (నారాయణపేట), అరవపల్లి వెంకన్న(మహబూబాబాద్), ప్రధాన కార్యదర్శిగా జి.రామయ్య (ఖమ్మం), సహాయ కార్యదర్శులుగా ఎస్.కిర ణ్(నారాయణపేట), వేముల గురునాథం (కొత్తగూడెం), కోశాధికారి కె.రాజేశ్వర్(నిజమాబాద్), కార్యవర్గ సభ్యులు జి.రాజు (నారాయణపేట), సీహెచ్.కుమార్ (కొత్తగూడెం), బత్తుల వెంకటేశ్వర్లు (మణు గూరు), మిట్టపల్లి రాజేందర్ (మణుగూరు), డి.రవికిరణ్ (నిజామాబాద్, ఎం.రవికు మార్ (నిజామాబాద్), మల్లేష్ (బోధన్), జె.మక్కయ్య (బోధన్), కిన్నెర నారాయణ (ఖమ్మం), యాదక్క (ఖమ్మం), పార్వు (ఖమ్మం) విడదాసు లక్ష్మణ్ (మహబూబాబాద్), బానోత్ రాంలాల్ (మహబూబాబాద్)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నకిలీ మందులు అమ్మారంటూ రైతుల ఆందోళన



చిల్కోడులో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

డోర్నకల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం చిల్కోడులో ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన పురుగుల మందు మిర్చి పంటపై వస్తున్న నల్ల తామర నివారణ కొరకు కొంతమంది రైతులు వాడారు. ఆ మందు పిచికారీ చేసిన అనంతరం తోటలు దెబ్బతిన్నాయని ఆరోపిస్తూ షాపు ఎదుట రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, సీఐ రాజేష్‌లు అక్కడికి చేరుకున్నారు. షాపు యాజమాని వద్ద ఉన్న మందులను పరీక్షించి సరఫరా చేసిన తిరుపతి అనే డీలర్‌ను రప్పించారు. ఎండోఫిల్ ఎలక్టో కంపెనీ లోగోలు తేడాగా ఉన్నాయని, ఇది నకిలీదని, తమకు నష్టం జరిగిందని రైతులు అతన్ని నిలదీశారు. తాము వీటిని కంపెనీకి పంపించి పరీక్షలు నిర్వహిస్తామని తిరుపతి సమాధానం చెప్పారు. కొన్ని శాంపిల్స్‌ను సేకరించిన వ్యవసాయాధికారి వాటిని ల్యాబ్‌లో పరీక్షించి నకిలీవని తేలితే చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఒక్క ఫోన్‌కాల్‌తో రూ.95,100 మాయం

మహబూబాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఓ అపరిచిత వ్యక్తి వద్ద నుంచి వచ్చిన ఫోన్‌కాల్ లిఫ్ట్ చేయడం వల్ల తన అకౌంట్‌లోని రూ. 95,100 మాయమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తిపాక కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాక కాలనీకి చెందిన ఓ వ్యక్తికి అపరిచిత వ్యక్తి వద్ద నుంచి ఫోన్‌కాల్ రావడంతో లిఫ్ట్ చేశాడు. ఆ వెంటనే తన అకౌంట్‌లో ఉన్న రూ.95,100 విత్‌డ్రా చేసుకున్నట్లు మెసేజ్ వచ్చినట్లు చెప్పారు. ఆ మెసేజ్‌ను చూసుకున్న ఆ వ్యక్తి వెంటనే తన అకౌంట్ వివరాలు చెక్ చేసుకోగా అతని అకౌంట్ నుంచి అమౌంట్ కట్ అయినట్లు తెలుసుకున్నాడు. వెంటనే మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా



ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

ఏటూరునాగారం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతాల్లో జీవో 3 అమలుతో పాటు 29 శాఖలపై ట్రైబల్ అడ్వైజరీ కమిటీ, అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ చట్టాలను అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని చట్టాలు అమలు కాక ఆదివాసులు అవస్థలు పడుతున్నారని ఆయన ఆరోపించారు. ఆదివాసుల పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించి వారి పొలాల్లో ఉచితంగా బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన ఇసుక సొసైటీలకు క్యూబిక్ మీటరు రూ. 220 నుంచి రూ.450కి పెంచాలన్నారు. అనంతరం పలు డిమాండ్లకు కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు ఉయిక శంకర్, ధనసరి రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

- గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల సమస్యలను త్వరగా పరిష్కరించేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీవో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. 24మంది గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకెళ్లారు. పలు వినతులతో పాటు కన్నాయిగూడెం మండలంలో కొమురం భీం విగ్రహ ఏర్పాటునకు సహకరించాలని తుడుందెబ్బ పొలిట్‌బ్యూరో సభ్యుడు పోడెం బాబు పీవోను కోరారు. ఈకార్యక్రమంలో డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'పీఎం కుసుం' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'పీఎం కుసుం' పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 'పీఎం కుసుం' పథకంపై పెసా మొబిలైజర్‌కు అవగాహన కార్యక్రమంలో పీవో మాట్లాడారు. 4 ఎకరాల ఆర్వోఎఫ్‌ఆర్ లేదా రెవెన్యూ పట్టా భూమి ఉండి సబ్‌స్టేషన్లకు 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న భూములను 25 సంవత్సరాలకు లీజు తీసుకుంటుందని వెల్లడించారు. ఎకరం భూమికి సంవత్సరానికి రూ.12,500 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుందని పీవో తెలిపారు. ఆ భూముల్లో సౌర విద్యుత్ కేంద్రాలను ప్రభుత్వం నెలకొల్పి వాటి నిర్వహణను స్వయం సహాయక సంఘాల ద్వారా చేపడతామన్నారు. పీఎం కుసుం పథకంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని పెసా మొబిలైజర్లకు పీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, పెసా జిల్లా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఎస్‌డీసీ డీటీ అనిల్, ఆర్వోఎఫ్‌ఆర్ డీటీ వెంకన్న పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో పీవోకు వినతి పత్రం అందిస్తున్న గిరిజనులు

జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు దరఖాస్తులు

ఐటీడీఏ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు జ్యూట్ బ్యాగ్ తయారీలో శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసై, 18 నుంచి 45 సంవత్సరాల గిరిజన మహిళలు ఈ నెల 27లోపు ఐటీడీఏ ఏటూరునాగారం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పీవో పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 8330954571 నంబర్‌ను సంప్రదించాలని పీవో చిత్రామిశ్రా తెలిపారు.

ఏజెన్సీ యువతికి ఐఎంఏ ఎంబీబీఎస్ పట్టా



హైదరాబాద్‌లో పట్టా తీసుకుంటున్న పావని

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన ఏజెన్సీ యువతి ఇండియాలో వైద్యం చేసేందుకు అర్హత కావాల్సిన ఐఎంఏ పట్టా సాధించారు. కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బైరబోయిన సదానందం, విజయలలిత దంపతుల కూతురు బైరబోయిన పావని రష్యా కిర్గిజిస్తాన్ దేశంలో బిస్కెక్ పట్టణంలో ఇంటర్నేషనల్ హయ్యర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ (ఐహెచ్‌ఎస్‌ఎం) యూనీవర్శిటీలో 2019 నుంచి 2024 వరకు వైద్య విద్యను అభ్యసించింది. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ఇండియాలో వైద్యం చేయాలంటే ఐఎంఏ పట్టా పొందాల్సి ఉంది.

హైదరాబాద్ మెహదీపట్నంలోని మెడికల్ అకాడమీలో పావని ఆరు నెలలు శిక్షణ పూర్తి చేసి ఐఎంఏ ఎంబీబీఎస్ పట్టా పొందారు. పావని వైద్యవిద్యా పట్టా సాధించడంతో పొగుళ్లపల్లిలో వైద్యుల సంఖ్య నలుగురికి చేరింది.

దామోదర్ సేఫ్!

- మావోయిస్టు తెలంగాణ చీఫ్ మృతి వదంతే..
- నాలుగు రోజులైనా స్పష్టతనీయని పోలీసులు
- ఆ లేఖ నకిలీదేననే ప్రచారం
- స్పందించని మావోయిస్టు పార్టీ నాయకత్వం



దామోదర్ (ఫైల్)

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ క్షేమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12మంది మావోయిస్టులు హతమైనట్లు ఆ రాష్ట్ర పోలీసులు ప్రకటించారు. సంఘటన జరిగిన రెండురోజుల తర్వాత మొత్తం 18 మంది మృతిచెందారని, క్రిపణితో పోలీసులు జరిపిన దాడిలో తెలంగాణ చీఫ్ దామోదర్‌ను కోల్పోయామంటూ దక్షిణ బస్తర్ డివిజన్ కార్యదర్శి గంగ పేరిట ఓ లేఖ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమైంది. దీంతో దామోదర్ మరణించాడని అందరూ భావించారు. అయితే లేఖలో స్పష్టత లేకపోవడం, ఆయన మృతిని పోలీసులు నిర్ధారించకపోవడంతో అంతా సందిగ్ధంలో పడ్డారు. రూ.50లక్షల రివార్డును కలిగి ఉండి గత రెండున్నర దశాబ్ధాలుగా తెలంగాణ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఆ శాఖకు అతిపెద్ద విజయంగా భావించవచ్చు. యాంటీ నక్సల్ ఆపరేషన్లు, సమాచారం ఇచ్చిపుచ్చుకునే విషయాలలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన డీజీపీ ర్యాంకు అధికారులు సరిహద్దు ప్రాంతాలలో తరుచూ సమావేశమవుతూ ఉంటారు. అలాంటిది ఒకవేళ దామోదర్ మరణించినట్లయితే మన రాష్ట్రానికి చెందిన పోలీసు ఉన్నతాధికారులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి నిర్ధారించుకునే అవకాశముంది. కానీ, ఎన్‌కౌంటర్ జరిగి ఐదురోజులు గడిచినా పోలీసు వర్గాల నుంచి స్పష్టత లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నట్లు కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శి స్థాయి నేతకు భారీ భద్రత ఉంటుంది. కనీసం మూడంచెల రక్షణ వలయంలో.. 20మందికి తగ్గకుండా అంగరక్షకులు అతని చుట్టూ ఉండే అవకాశముంది.

16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారిలో ఎక్కువమంది మిలీషియా సభ్యులే కాగా ఆస్థాయి వారిని స్టేట్ చీఫ్ సెక్యూరిటీకి నియమించే అవకాశం లేదు. లేఖలో పేర్కొన్నట్లుగా ఒక వేళ దామోదర్ చనిపోయినా ఆయన అంత్యక్రియలు ఎలా జరిగాయోననే సమాచారం లేదు. ఫొటోలు కూడా రాలేదు. క్రితం మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ కరోనా బారిన పడి మరణిస్తే అడవిలోనే ఆయనకు అంతిమ సంస్కారాలు జరిపించినట్లు పార్టీ ప్రకటించింది. కానీ, దామోదర్ విషయంలో ఇవేమీ లేవు. మావోయిస్టుల పేరిట లేఖ, దామోదర్ మృతి ప్రచారం అంతా పోలీసుల మైండ్‌గేమ్‌లో భాగమనే చర్చ జరుగుతోంది. సూక్ష్మస్థాయిలో మావోయిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం కోసమే వదంతులకు ఊతమిచ్చారని తెలుస్తోంది. గతంలో అనేక పర్యాయాలు ఇలాగే దామోదర్ ఎన్‌కౌంటరయ్యాడంటూ ప్రచారం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాల దాడులు ముమ్మరం కావడంతో ఇటీవలి కాలంలో వందల మంది మావోయిస్టులు మరణించారు. పార్టీని కాపాడుకోవాలంటే తెలంగాణ అభయారణ్యాలను సేఫ్‌జోన్‌గా భావిస్తూ అన్నలు తిరిగి స్వరాష్ట్రానికి వస్తున్నట్లు నిఘా వర్గాలకు ఉప్పందింది. అర్బన్ ప్రాంతంలో రహస్యంగా తిష్టవేసి రిక్రూట్‌మెంట్లను పెంచుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా పసిగట్టారు.

ఈ క్రమంలో సరిహద్దుపై నిఘా పెంచిన తెలంగాణ పోలీసులు మావోయిస్టుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ఇదే సమయంలో కమ్యూనిస్టు భావజాలం ఉండి అజ్ఞాతంలోకి వెళ్లాలనుకునే వారి మనో ధైర్యాన్ని దెబ్బతీసే వ్యూహంలో భాగంగా దామోదర్ మృతి చెందాడని పోలీసులే ప్రచారం చేస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. తద్వారా నూతన చేరికలకు అడ్డుకట్ట వేయడం ఖాకీల ఎత్తుగడగా స్పష్టమవుతోంది. ఏదేమైనా ఇటు పోలీసులు కానీ, అటు మావోయిస్టు అగ్రనాయకత్వం కానీ స్పష్టమైన ప్రకటన చేస్తేనే తప్ప దామోదర్ మృతి వార్తలపై నెలకొన్న సందేహాలు తొలిగిపోయేలా లేవు.

నేడు డయల్ యువర్ డీఎం

తొర్రూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు ఆర్టీసీ డిపో పరిధిలోని రూట్‌లలో బస్సుల వివరాలు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సలహాలు, సూచనల కోసం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డిపో పరిధిలోని ఆయా రూట్‌లలో మౌలిక సదుపాయాలు, బస్టాండ్ ఆవరణలో ప్రయాణీకులకు కలిగే ఇబ్బందులు తదితర అంశాలపై సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులు కూడా చేయవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959226053 నంబరులో సంప్రదించాలన్నారు.

కారు బోల్తా.. యువకుడి మృతి

- ఐదుగురికి గాయాలు
- స్నేహితులను కలిసేందుకు వెళ్తుండగా ప్రమాదం
- జనగామ జిల్లా పెంబర్తి వై జంక్షన్ వద్ద ఘటన
- మృతుడిది భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి



సిద్ధార్థరెడ్డి (ఫైల్)



ప్రమాద ఘటనలో బోల్తాపడిన కారు

జనగామ రూరల్/మొగుళ్లపల్లి జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులను కలిసేందుకు వెళ్తూ యువకుడు అనంత లోకాలకు చేరిన ఘటన జనగామ మండలంలోని పెంబర్తి వైజంక్షన్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొరికిశాల పంచాయతీ పరిధి బద్దంపల్లి గ్రామానికి చెందిన బద్దం సిద్ధార్థరెడ్డి(20) తన స్నేహితులైన కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి అభిచరణ్, తోట అక్షిత్, గుజ్జుల నందు, అంజి, బండ గణేష్‌రెడ్డి హన్మకొండలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్నారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో ఉన్న స్నేహితులను కలిసేందుకు కారులో బయల్దేరారు. సిద్ధార్థరెడ్డి కారు నడుపుతుండగా మిగతా వారు ప్రయాణిస్తున్నారు. కారు సోమవారం తెల్లవారుజామున జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో సిద్ధార్థరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. నందు, అంజిలకు తీవ్ర గాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కొరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుపై సీతక్క ఆగ్రహం

- మా పార్టీవైనా తొలగించండి
- డీపీవోకు మంత్రి ఆదేశం

ములుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మా పార్టీవైనా సరే తొలగించండి' అంటూ డీపీవోను ఆదేశించారు. ములుగును క్లీన్‌గా ఉంచాలని సూచించారు. సోమవారం ములుగులోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించేందుకు వచ్చారు. ఆస్పత్రి భవనం కనిపించకుండా భారీ సైజులో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల బీజేపీ -కాంగ్రెస్ మధ్య గొడవకు ఫ్లెక్సీలే కారణమైన విషయం తెలిసిందే. ఏరియా ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేసిన బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌కు చెందిన ఫ్లెక్సీలను ధ్వంసం చేయగా.. ఆగ్రహించిన కాం గ్రెస్ నాయకులు బీజేపీ నాయకుడి దుకాణంపై దాడికి పాల్పడ్డా రు. ఆయా పార్టీలకు చెందిన వారు జాతీయ రహదారి పొడవునా డివైడర్‌పై ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వీటి కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫ్లెక్సీలను తొలగించాలని గతంలో ప్రజాసంఘాల నాయకులు పోలీసులు, అధికారులను కోరారు. అయితే ఎక్కువ శాతం ఫ్లెక్సీలు అధికార కాంగ్రెస్‌కు చెందినవే కావడంతో అధికారులు వాటిని తొలగించే సాహసం చేయలేకపోయారు. మంత్రి సీతక్కపై అభిమానంతో బండారుపల్లి రోడ్డు నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా పెద్దసంఖ్యలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు కలెక్టర్ ఆఫీసునూ వదల్లేదు. ప్రధాన ద్వారానికి ఇరువైపులా హస్తం పార్టీకి పోటీగా బీఆర్ఎస్ నాయకులు భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో పక్షపాతం వద్దని మంత్రి ఆదేశాలతో అధికారులు ఏమేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



ములుగులోని ఏరియా ఆస్పత్రి ఎదుట భారీ ఫ్లెక్సీలు

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మరిపెడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ డెవలప్‌మెంట్ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి సత్వరం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మరిపెడ మునిసిపాలిటీలోని పలు కాలనీలలో జరుగుతున్న అర్బన్ డెవలప్‌మెంట్ ఫండ్స్ ద్వారా చేపట్టిన పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మరిపెడ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలోని డైనింగ్‌హాల్ పనులను తనిఖీ చేశారు. పట్టణంలోని రాంవిలాస్ గల్లీ, ఆడిటోరియం, మోడల్ మార్కెట్ తదితర వర్క్స్ పరిశీలించి అధికారులను పనుల నాణ్యత ప్రమాణాలపై ఆదేశించారు. కలెక్టర్ వెంట స్పెషల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, తహసీల్దార్ సైదులు, మునిసిపల్ కమిషనర్ నరేశ్‌రెడ్డి, మునిసిపాలిటీ ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.



మరిపెడ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాల కతీతంగా గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 5వ వార్డు పరిధిలోని అనంతారంలో ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో నిర్మించతల పెట్టిన సీసీ రోడ్డు, మహబూబాబాద్ మండలం చోక్లాతండా జీపీ పరిధిలోని మేఘ్యాతండాలో రూ.5లక్షలతో నిర్మించే సైడ్ డ్రైనేజీ కాల్వ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. అనంతారంకు ఒక ప్రత్యేకత ఉందని, మాజీ ఎమ్మెల్యే జెన్నారెడ్డి జనార్ధన్‌రెడ్డి సొంత గ్రామమని, అందుకోసం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.



మేఘ్యాతండాలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గ్రామసభలకు హాజరు కావాలి

సంక్షేమ పథకాల అమలు కోసం జనవరి 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభలకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ కోరారు. గ్రామాల వారీగా కేటాయించిన తేదీల్లో షెడ్యూల్ ప్రకారం అధికారులు గ్రామ సభలు నిర్వహిస్తారని చెప్పారు. గతంలో ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డు రాని వారు గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జెన్నారెడ్డి మురళీధర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మీశ్రీను, మండల అధ్యక్షుడు మిట్టకంటి రాంరెడ్డి, గార్లపాటి సాయి, భూక్య సుందర్, గుగులోతు మురళీ, బోడ సురేష్, రమేష్, బాలకిషన్, నరేందర్, హోలీ, కొండయ్య, లింగ శ్రీను, శేఖర్, అంజిబాబు పాల్గొన్నారు. పట్టణంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18 నుంచి 20 వరకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన బ్లాక్ స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మె ల్యే మురళీనాయక్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర బాధ్యులు, ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు అచ్చ సుజిత్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2387	2160
పల్లికాయ (సూక)	6310	5600
పల్లికాయ (పచ్చిది)	4450	4100
కందులు	7156	5560
పెసళ్లు	6352	4570
పత్తి	7220	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14700	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15500	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	14500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

కమిటీల పేరుతో కాలయాపన

మాలల ఒత్తిడికి వర్గీకరణపై తలొగ్గిన కాంగ్రెస్ సర్కారు

- డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం మావైపుంది
- మా పోరాటానికి సబ్బండ వర్గాల సంఘీభావం
- హనుమకొండలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



వేయిస్తంభాల దేవాలయం నుంచి ర్యాలీగా వస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

వడ్డెపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కమిటీల పేరుతో ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, మాలల ఒత్తిడికి తలొగ్గిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ధ్వజమెత్తారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేల గొంతులు.. లక్ష డప్పుల సన్నాహక సాంస్కృతిక ప్రదర్శనను సోమవారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం వద్ద ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, కొండేటి శ్రీధర్‌లతోకలిసి ప్రారంభించారు. తొలుత వేయిస్తంభాల దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మహా సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ డబ్బు, అధికారం మాలల వైపు ఉంటే ధర్మం తమ వైపు ఉందని అన్నారు. రెడ్ల కాంగ్రెస్‌ను మాల ఎమ్మెల్యేలు శాసిస్తున్నారని పేర్కొన్నారు. మాదిగల ధర్మ పోరాటానికి సబ్బండ వర్గాలు సంఘీభావం తెలుపుతున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని, దీన్ని తొలుత రాష్ట్రంలోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని మంద కృష్ణ మాదిగ గుర్తు చేశారు. కేవలం వర్గీకరణను వివేక్ వెంకటస్వామి కుటుంబమే అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ కట్టుబడి ఉందని రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాలల ఎమ్మెల్యేల మెప్పుకోసమే తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. మాదిగ జాతి కోసం బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అన్ని పార్టీలు కలిసి వచ్చినా కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేయడం విడ్డూరమని విమర్శించారు. ఇప్పటికే దేశంలోని తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో ముమ్మరమైందని మంద కృష్ణ మాదిగ వివరించారు. మాలల ఒత్తిడి తలొగ్గితే మాదిగల ఆగ్రహానికి కాంగ్రెస్ ప్రభుత్వం గురికావలసి వస్తోందని హెచ్చరించారు. ఒకే కుటుంబంలో మూడు పదవులు పొందిన వివేక్, వినోద్, వంశీకృష్ణలు తమ ధన ప్రభావంతో 30 ఏళ్ల వర్గీకరణ పోరాటానికి అడ్డుపడుతున్నారని అన్నారు. వర్గీకరణ చేస్తే కాంగ్రెస్‌ను ఉపేక్షిస్తాం కానీ మాల కులస్థులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని వచ్చే ఎన్నికల్లో మాదిగలు చైతన్యవంతులై వారిని ఓడించడం ఖాయమని మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ సామాజిక వర్గంలోని 59 కులాలలో వర్గీకరణకు 58 కులాలు అనుకూలంగా ఉన్నాయని కేవలం మాలలే అడ్డు తగలడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కవి, రచయిత సంగంరెడ్డి పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ మంద కృష్ణ చేపట్టిన వర్గీకరణ ఉద్యమం న్యాయమైందని దీనికి సబ్బండ వర్గాలు మద్దతు తెలుపుతున్నాయని అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ సామాజిక వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టాలని డిమాండ్ చేశారు. కవి, గాయకుడు, రచయిత మిట్టపెల్లి సురేందర్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సన్నాహక సభలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ, జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు, గాయకులు వరంగల్ శ్రీనివాస్, ఏపూరి సోమన్న, రేలారే రేల గంగా, పాటమ్మ రాంబాబు, ధరువు ఎల్లన్న, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, రాష్ట్ర నేతలు పుట్ట భిక్షపతి మాదిగ, అక్కనకుంట వెంకటస్వామి, ఆరెపల్లి పవన్, బొక్కల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఆధ్యాత్మికం

వృత్తి ఆధ్యాపకం.. ప్రవృత్తి ఆధ్యాత్మికం

- తన తాత బాటలో నడుస్తున్న సంస్కృత పండితుడు
- టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక సేవలు
- 12 ఏళ్లుగా పాశురాలపై తేటతెలుగులో ప్రవచనాలిస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్



ధనుర్మాసం సందర్భంగా ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణమీనన్

హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆయన వృత్తి రీత్యా అధ్యాపకుడు. ప్రవృత్తి రీత్యా ఆధ్యాత్మిక వేత్త. ఓ వైపు కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూనే మరో వైపు ధార్మిక సేవను కొనసాగిస్తున్నారు. ప్రజల్లో సన్మార్గంలో పెట్టేందుకు గాను.. వారిలో ధర్మచింతను పెంపొందించడానికి మూడు దశాబ్దాలుగా విశేషంగా కృషి చేస్తూ.. ప్రత్యేక గుర్తింపు పొందారు ఉభయ వేదాంత డాక్టర్ క్రిష్ణమీనన్. ప్రముఖ సంస్కృత పండితులు, కవి శతాబ్ది కేసరి ఉభయవేదాంత నల్లాన్ చక్రవర్తుల రఘునాథా చార్యుల మనవడైన క్రిష్ణమీనన్ తాత చూసిన బాటలో నడుస్తూ ధార్మిక ప్రవచనాలు చేస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. 12ఏళ్లుగా ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ద్వారా తిరుప్పావై ప్రవచనాలు చేస్తున్న ఆయన.. ధనుర్మాసంలో వివిధ ఆలయాల్లో గోదాదేవి పాశురాలపై చేస్తున్న ప్రవచనాలు ఎందరిలోనో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయి. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ గోదాదేవి మూలద్రావిడలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక పన్నిద్దరాళ్వార్లు రచించిన నాలాయిర దివ్యప్రబంధంలో ఒక ముఖ్యభాగమై తమిళ సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది. ఈ పాశురాలను డాక్టర్ మీనన్ తేటతెలుగులో సులభమైన శైలిలో అందరికి అర్థమయ్యే రీతిలో వివరిస్తున్నారు. ఇక 20ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వివిధ ఆలయాల్లో ధార్మిక ప్రవచనాలను కొనసాగిస్తున్నారు. ఇలా ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేయడంతో పాటు సంస్కృత అధ్యాపకుడిగా సంస్కృతం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని, అభిరుచిని పెంచేందుకు శ్రమిస్తున్నారు.

పండిత ప్రకర్ష..

డాక్టర్ క్రిష్ణమీనన్ ఉస్మానియా యూనివర్సిటీలో సంస్కృతంలో ఎంఏ ఎంఫిల్, కాకతీయ విశ్వవిద్యాలయలో తెలుగులో ఎంఏ టీపీటీ, తెలుగు వర్సిటీలో ఎంఏ ఆస్ట్రాలజీ చేశారు. తన తాత రఘునాధాచార్యుల వద్ద సంస్కృత వ్యాకరణ ఆధ్యాత్మిక గ్రంథాలను అభ్యసించారు. డాక్టర్ మీనన్ తల్లిదండ్రులు నరసింహాచార్యులు, వెంకటలక్ష్మమ్మ కాగా 30 సంవత్సరాలుగా సంస్కృత అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. 25 ఏళ్లుగా హనుమాన్ జ్యోతిషాలయాన్ని కూడా నిర్వహిస్తున్నారు. డాక్టర్ మీనన్ ప్రస్తుతం ఆల్ఫోర్స్ కళాశాలలో సీనియర్ సంస్కృత అధ్యాపకుడిగా పని చేస్తున్నారు.



ఆలయంలో ఆశేషంగా హాజరైన మహిళా భక్తులను ఉద్దేశించి తిరుప్పావై పాశురాలపై ప్రవచనం చేస్తున్న డాక్టర్ క్రిష్ణ మీనన్

పురస్కారాలు..



మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న క్రిష్ణ మీనన్

ఆధ్యాత్మిక రంగంలో చేస్తున్న విశేషమైన కృషికి గుర్తింపుగా పలు సంస్థలు డాక్టర్ మీనన్‌ను సత్కరించాయి. పలు పురస్కారాలను ప్రదానం చేశాయి. అబ్దుల్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుతో సన్మానించింది. బిర్లా ఫౌండేషన్ జ్యోతిష విభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. విశ్వవిజ్ఞాన జ్యోతిష సంస్థ గౌరవ డాక్టర్‌తో, కేన్యూస్ చానెల్ ఉగాది పురస్కారంతో సత్కరించింది. పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంస్థలతో అనుబంధం కలిగి ఉన్న డాక్టర్ క్రిష్ణమీనన్ ఐదు సంవత్సరాలుగా రాష్ట్ర సంస్కృత భారతి ఉపాధ్యక్షుడిగా, ప్రస్తుతం వరంగల్ సంస్కృత అధ్యాపకుల సంఘం గౌరవాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి.. ఇద్దరికి గవర్నర్ పురస్కారాలు

- ఎక్స్‌లెన్స్ అవార్డులకు ప్రొఫెసర్ పాండురంగారావు, దీప్తి ఎంపిక
- సంస్కృతి, వారసత్వ సంపద, క్రీడా రంగాల్లో చేసిన కృషికి గుర్తింపు



హనుమకొండ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసినవారికి ప్రతిష్టాత్మకమైన గవర్నర్ ఎక్సెలెన్సీ అవార్డులను అందజేస్తారు. ఈ ఏడాది ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఈ పురస్కారాలకు ఇద్దరు ఎంపికయ్యారు. వీరిలో ఒకరు ప్రొఫెసర్ పాండురంగారావు కాగా మరొకరు పారా అథ్లెటిక్ జీవంజి దీప్తి. సంస్కృతి, వారసత్వ సంపద కేటగిరీలో పాండురంగారావుకు ఈ అవార్డురాగా దీప్తికి క్రీడారంగంలో ప్రతిభ చాటినందుకుగాను దక్కింది. రాష్ట్రంలో మొత్తం 8 మందికి ఈ అవార్డులు రాగా వీరిలో ఇద్దరు ఉమ్మడి వరంగల్ వారే కావడం విశేషం. ప్రధానంగా నాలుగు రంగాలు- పర్యావరణ పరిరక్షణ, దివ్యాంగుల సంక్షేమం, క్రీడలు, కల్చర్‌లో విశేషమైన కృషి చేసినందుకు గుర్తిం పుగా గవర్నర్ చేతుల మీదుగా ఈ ఎక్సెలెన్స్ అవార్డుల ప్రదానం జరగనుంది. ఈ అవార్డు కోసం గత నవంబరులో దరఖాస్తులను కోరగా 594 మంది దాఖలు చేశారు. అవార్డుల కమిటీ వడపోత తర్వాత ఎనిమిది మంది ఎంపికయ్యారు. ఈ అవార్డు కింద రూ.2లక్షల నగదు, ప్రశంసా పత్రం అందజేశారు.

వారసత్వ పరిరక్షణలో పాండురంగారావు కృషి

కాజీపేట సిద్ధార్థనగర్‌లో నివాసముంటున్న వరంగల్ నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండు రంగారావు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాకతీయుల వారసత్వ సంపద, ప్రాచీన కట్టడాలు, అలనాడు వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువులను కాపాడడంలో విశేషంగా కృషి చేశారు. విద్య, వైద్య రంగాల్లోనూ ఆయన విస్తృతమైన సేవలు అందించారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఎస్‌సీ (జీయాలజీ), ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ చేశారు. ప్రొఫెసర్ పాండురంగారావు చదువుల్లోనే కాకుండా ఆటల్లోనూ మేటి అనిపించుకున్నారు. వరంగల్ నగరంలో 1972, 1973 సంవత్సరంలో తీవ్రమైన కరువు ఏర్పడి తాగునీటి సమస్య తలెత్తినప్పుడు దాని శాశ్వత పరిష్కారానికి కృషి చేశారు. 1984లో తాను పని చేస్తున్న ఆర్ఈసీ (ప్రస్తుతం నిట్)లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నప్పుడు త్రీ డైమెన్షనల్ మోడల్ ప్రాజెక్టులో భాగంగా శ్రీరాం సాగర్ వరద నీటిని వాడుకోవడంతో పాటు ఫ్లడ్‌ఫ్లో కెనాల్, మిడ్‌మానేర్ డ్యాం డిజైన్‌లో కీలక భూమిక పోషించారు. అలాగే కాకతీయుల కట్టడాలు, నీటిపారుదల ప్రాజెక్టులపై విస్తృతమైన పరిశోధన చేశారు. జీయో టెక్నికల్ అప్రేజల్ అండ్ ఎవాల్యూషన్ ఆఫ్ కాకతీయ మాన్యుమెంట్స్ పేరుతో భారత పురావస్తు శాఖ చేపట్టిన రీసెర్చ్ ప్రాజెక్టుకు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఏడేళ్లపాటు సుదీర్ఘంగా అధ్యయనం చేసి సమగ్రమైన నివేదికను సమర్పించారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడి ఆవరణలో శిధిలావస్థకు చేరిన కల్యాణ మండపాన్ని పునర్నించడంలో ప్రొఫెసర్ పాండురంగారావు చేసిన కృషి అమూల్యం. 30సంవత్సరాలుగా ఇంటాక్ కన్వీనర్‌గా ఆయన అనేక కాకతీయ కట్టడాల పునరుద్ధణకు కృషి చేశారు. 2009లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీవీ పాపారావుతో కలిసి ఏర్పాటు చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ద్వారా కాకతీయుల వారసత్వ సంపద, వారు నిర్మించిన గొలుసుకట్టు చెరువుల ప్రాముఖ్యతను విశేషంగా ప్రచారంలోకి తీసుకువచ్చారు. చారిత్రకంగా సుప్రసిద్ధమైన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడంతో ప్రొఫెసర్ పాండురంగారావు ఎంతగానో శ్రమించారు. రామప్పపై ప్రత్యేకంగా ఒక డోజర్‌ను రూపొందించడం ద్వారా యునెస్కో ప్రతినిధులను ఒప్పించడంలో కీలకంగా వ్యవహరించారు. నగరంలోని ఎంజీఎం, సీకేఎం ఆసుపత్రుల అభివృద్ధికి శ్రమించారు. హెరిటేజ్, కల్చర్, విద్య, వైద్య రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా ప్రొఫెసర్ పాండురంగారావు అనేక పురస్కారాలను అందుకున్నారు. తాజాగా గవర్నర్ ఎక్సెలెన్స్ అవార్డు కూడా వరించింది.

వైకల్యాన్ని జయించి..అవమానాలను అధిగమించి..

పేదరికాన్ని లెక్కచేయకుండా.. వైకల్యాన్ని జయించి.. అవమానాలను అధిగమించి.. రికార్డుల రారాణిగా సత్తా చాటి ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా ఒలింపియన్ జీవంజి దీప్తికి మరో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన ఆమె ఇటీవలే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అర్జున అవార్డును అందుకోగా... తాజాగా గవర్నర్ ఎక్స్‌లెన్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆమె రూపం గురించి ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదురైనా క్రీడల్లో రాణించి పారా ఒలింపిక్స్‌లో అర్జున పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు పారాలింపియన్‌గా నిలిచారు.

వేగంగా జరుగుతున్న షెడ్ నిర్మాణం



24న కొండపర్తికి గవర్నర్

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభానికి అధికారుల సన్నాహాలు



తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో కొండపర్తి గ్రామానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రానున్నారని సమాచారం. గవర్నర్ దత్తత గ్రామం కొండపర్తిని మోడల్ గ్రామంగా రూపొందించే దిశగా అధికారులు పలు అభివృద్ధి పనులు ప్రాంభించారు. ఈ నెల 24న గవర్నర్ కొండపర్తికి వచ్చే అవకాశం ఉన్నందున అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో షెడ్ నిర్మాణాలు, పాఠశాల మరమ్మతు, ప్రారంభం రోజు కొమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాల ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయి. 23వ తేదీలోగా కుట్టు మిషన్లు, ప్యాకింగ్ మిషనరీ, ప్లేట్ల తయారీ మిషన్లు గ్రామానికి చేరుకోనున్నాయి.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో మొదలైన మినీ సంబురం

ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో వనదేతలకు ముందస్తు మొక్కులు ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా సోమవారం సుమారు 10వేల మందికి పైగా భక్తులు మేడారం చేరుకున్నారు. సమ్మక్క సారలమ్మల గద్దెలకు పూజలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారెలు కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకున్నారు. యాట మొక్కులను చెల్లించుకొని కోరికలు తీరాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ పరిసరాలు, అడవి ప్రాంతాలు, వసతి భవనాల్లో విడిది చేసి సేద తీరారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్ సాధించాం..

- అన్ని వర్గాలకు బ్యాంకు సేవల విస్తరణ
- దళారీ వ్యవస్థ లేకుండా రుణాల అందజేత
- కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచాం
- వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 20 : డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి సాధనలో రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని సాధించామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. డీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంచుకొంటూ ఆ మేరకు ఫలితాలు సాధిస్తూ వచ్చామన్నారు. రూ. 2 వేల కోట్ల టర్నోవర్‌ను సాధించడం ఆనందంగా ఉందన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గం మహాజన సభ జరిగింది. డీసీసీ బ్యాంకు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అధ్యక్షతన జరిగింది. సభను ఉద్దేశించి రవీందర్‌రావు మాట్లాడారు. బ్యాంకు సేవలు, ఆర్థికాభివృద్ధి, రుణాలు, రైతు రుణమాఫీ, రుణాల రికవరీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మల్టీ సర్వీసు సెంటర్ల నిర్వహణ తదితర అంశాలను రవీందర్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభకు వివరించారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్

రూ.860 కోట్ల నుంచి రూ. 2 వేల కోట్ల టర్నోవర్ దశకు బ్యాంకు చేరడం మాములు విషయం కాదన్నారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యుల సమష్టి కృషే కారణమన్నారు. తమ పాలకవర్గం ఏర్పడిన సమయంలో రూ.860 కోట్ల టర్నోవర్‌తో బ్యాంకు ఉందన్నారు. ప్రతీ సంవత్సరం టర్నోవర్ లక్ష్యం పెంపు ప్రణాళికను రూపొందించుకున్న సమయంలో అనేక అవరోధాలు ఏర్పడ్డాయన్నారు. అయితే బ్యాంకు అధికారులు, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ఛాలెంజ్‌గా తీసుకొని ముందుకు సాగామన్నారు. ఈ ప్రయాణంలో రూ.1160 కోట్ల టర్నోవర్‌కు చేరడం మాకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు.

కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా నిలిచిందని చైర్మన్ రవీందర్‌రావు పేర్కొన్నారు. ఒకప్పుడు డీసీసీ బ్యాంకు అంటే రైతులకు పరిమితమని భావన ఉండేదన్నారు. కానీ ఇప్పుడా పేరే లేదన్నారు. కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడీ సేవలు అందుతున్నాయన్నారు.

అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందాం...

బ్యాంకు సేవలను విస్తరించడం వల్ల రైతులకే కాకుండా అన్ని వర్గాల విశ్వాసాన్ని పొందగలిగామని రవీందర్‌రావు వెల్లడించారు. పంట రుణాలతో పాటు వ్యాపార, విద్య, స్వయం ఉపాధి రంగాలకు సైతం బ్యాంకు రుణాలను విస్తరించడంతో పాటు ప్రజల ఆదరాభిమానాలను బ్యాంక్ చూరగొంటుందన్నారు. ముఖ్యంగా దళారీ వ్యవస్థ లేకుండా రైతులు ఇతర వర్గాలకు రుణాల అందజేత జరిగిందన్నారు. రుణాల మంజూరిని అన్ని వర్గాలకు విస్తరించడంతో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ జీవితాల్లో ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నట్లు చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు కోట్లలో రుణాల కల్పన జరుగుతుండడంతో మహిళలు ఆర్థిక వృద్ధిని సాధిస్తున్నారని తెలిపారు.

ఏ గ్రేడ్ సాధనతో బాధ్యత మరింత పెరిగింది...

రాష్ట్రంలోనే వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ అన్ని విభాగాల్లో ఉన్నత ఫలితాలను సాధిస్తోందని రవీందర్‌రావు వెల్లడించారు. గతంలో నాబార్డ్ ప్రకటిత ర్యాంకుల్లో వరంగల్ చివరలో ఉండేదన్నారు. కానీ ఈ సారి 'ఏ' గ్రేడ్‌ను సాధించిన ఘనతను దక్కించుకుందన్నారు.

తొలి సారిగా మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటు

డీసీసీ బ్యాంకు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో మల్టీ సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పీఏయస్‌లు ఈ సెంటర్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా వృద్ధిని సాధిస్తున్నాయన్నారు. మల్టీ సర్వీసు సెంటర్ల ఏర్పాటులో భాగంగా పీఏసీయస్ ఆధ్వర్యంలో గోదాంల నిర్మాణం, నిర్వహణ, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్ తదితర వ్యాపార సంస్థలు ఏర్పడ్డాయన్నారు. వీటి ద్వారా లభించే ఆర్థిక వనరులతో పీఏసీయస్‌లు స్వయం ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నాయన్నారు. బ్యాంకు టర్నోవర్ ప్రగతితో పాటు అనేక విభాగాల్లో ఉన్నతి ఫలితాలను సాధించడం పట్ల చైర్మన్ రవీందర్‌రావును బ్యాంకు అధికారులు, సభ్యులు అభినందించారు.

డీసీవోల తీరుపై మండిపాటు

సమావేశంలో పాలకవర్గ సభ్యులు పలువురు డీసీవోల తీరుపై మండిపడ్డారు. కొందరు డీసీవోలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బ్యాంకు సేవలను రైతులు ఇతర వర్గాలకు అందచేయడమే లక్ష్యంగా తాము పని చేస్తుంటే డీసీవోలు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ పద్ధతిని మార్చుకోని పక్షంలో తమ ఆగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మహాజన సభలో బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, బ్యాంకు వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింగరావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, నరేందర్, రవిరాజా, సంజీవరెడ్డి, డీజీయం అశోక్, నాబార్డ్ డీడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాచకొండ ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో వేర్వేరుగా సోమవారం మధ్యాహ్నబోజన విరామ సమయంలో హెచ్‌ఎం రాములుపై దాడిని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుగులోతు భద్రు, ఉపాధ్యాయులు మౌనిక, సూర్యప్రకాష్, పవన్‌రాజ్, శ్రీదేవి పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలోని కంకరబోడు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నిరసనలో బిక్షపతి, కొడూరి శ్రీనివాస్, బిక్షం, సోమయ్య, రమ, మాధవి, ఆసిన్ ఫాతిమా, ప్రసాద్, శకుంతల, తిముమలయ్య, వెంకటేశ్వర్లు, సునిత, ఉమాదేవి, మల్లిఖార్జున్, నాగరాజు, నిర్మల, విజయశ్రీ పాల్గొన్నారు.

●కేసముద్రం : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ జేఏసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో గతనెల 23న హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడిపట్ల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.



కంకరబోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గంగుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు సదయ్య, చందర్, నర్సింహారెడ్డి, కుమారస్వామి, మధు, మదన్మోహన్, నాగయ్య శ్రీనివాస్, భద్రాసింగ్, పాల్గొన్నారు.

● నెల్లికుదురు : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మండలంలోని నర్సింహులగూడెం పాఠశాలలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భం గా టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, శ్రీనివాస్, సుకన్య పాల్గొన్నారు.

●తొర్రూరు : ఉపాధ్యాయులపై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతూ టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సోమవారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ మాట్లాడారు. నాయకులు ఉపేందర్ రెడ్డి, యాదవ రెడ్డి ఉన్నారు.

● మరిపెడ : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంపై దాడి చేయడం అమానుష చర్యని నిరసిస్తూ సోమవారం మరిపెడబంగ్లాలోని సీతారాంపూర్ స్కూల్ టీచర్లు లంచ్ బ్రేక్ సమయాన నల్ల రిబ్బన్స్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అర్జున్, పీఆర్టీయూ మండల కార్యదర్శి లింగాల మహేశ్, టీచర్లు మంగీలాల్, సందీప్, కవిత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్లపై కేసు

గార్ల జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గార్ల మ ండల కేంద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు బుద్ధారం తండా సమీపంలో బ్రిడ్జి కింద గుట్టు చప్పుడు కాకుండా పేకాట అడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుబడ్డారు. ఈ మేరకు ఎస్సై రీయాజ్ పాషా వివరాలు తెలిపారు. పట్టుబడిన వారిలో బుద్ధారం తండాకు చెందిన గుగులోత్ రమేష్, బానోత్ పాండు కుమార్, భూక్యా సంతులాల్, వాంకుడోత్ సురేష్, సురేందర్, సంతోష్‌లను పట్టుకొని విరి వద్ద నుంచి రూ 6360 నగదు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కిష్టాపురం రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయలయ్యాయి. వివరాల ప్రకారం మండలంలోని చెరువుముందు తండాకు చెందిన అజ్మీరా రాజు కొత్తగూడ నుంచి ద్విచక్రవాహనంపై చెరువు ముందు తండాకు వెళుతున్నాడు. ఈశ్వరగూడెం గ్రామానికి చెందిన కుంజ వర్మతేజ కొత్తగూడకు ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదుగా ఢీకొట్టుకున్నాయి. తీవ్ర గాయాలయిన అజ్మీరా రాజును, స్వల్పగాయాలైన వర్మతేజను మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్ తన స్వంత వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి ఒడిబియ్యం

మరిపెడ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోనే గిరిపురంలో ఆర్యవైశ్యులకు ఆడబిడ్డ అయిన వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మ వారికి పూజారి పుల్లారి అనిల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి అనిల్ మాట్లాడారు. ఈ నెల 17 నుంచి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తున్నామని, చివరి రోజైన సోమవారం ముందుగా వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మ వారిని మేళతాళాలతో సోమ కృష్ణ స్వగృహంలో ప్రతిష్ఠించామన్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తల్లాడ వెంకటరామారావు, మండల అధ్యక్షుడు గోవర్ధన్, సోమ నాగన్న, శ్రీనివాస్, వెంకట్, కిరణ్, కిషోర్, గజ్జి నాగయ్య, చకిలేల పురుషోత్తం, దారం నాగేశ్వరరావు, వల్లి రమేష్ పాల్గొన్నారు.

లెనిన్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

గంగారం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) హైదారాబాదులో మంగళవారం జరిగే లెనిన్ శతవర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. సోమవారం గంగారంలో పోస్టర్లు విడుదల చేసిన అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. రష్యాలో జార్ చక్రవర్తి దోపిడీ అణిచివేతలకు వ్యతిరేకంగా రష్యన్ ప్రజలను విప్లవకారులుగా మార్చి ప్రపంచంలో తొలి సోషలిస్టు రాజ్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత లెనిన్‌కే దక్కుతుందని అన్నారు. దేశంలో పేద ధనిక అంతరాలను నిర్మూలించటానికి లెనిన్ చూపిన సోషలిస్ట్ విప్లవమే ఏకైక మార్గమని అన్నారు. జెజ్జర సురేష్, సిద్దబోయిన పాపయ్య, వీరస్వామి, వెంకన్న, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటీ నుంచి గ్రామ సభలు

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాల అమలుపై నేటీ (21)నుంచి మండలంలోని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసిల్దారు రమాదేవి పేర్కొన్నారు. 21న తాటివారివేంపల్లి, గోపాలపురం, గోవిందాపురం, పెగడపల్లి, ముస్మి, రామన్నగూడెం, మొండ్రాయిగూడెం, కొత్తపల్లి, కోనాపురం, ఎంచగూడెం, 22న బత్తులపల్లి, చెరువుముందు తండా, గుంజేడు, కొత్తగూడ, ఓటాయి, రేణ్యాతండా, ఎదుళ్లపల్లి, పొగుళ్లపల్లి, దుర్గారం, 23న వేలుబెల్లి, గుండం, కార్లాయి, సాధిరెడ్డిపల్లి, జంగవానిగూడెం గ్రామాలలో నిర్వహించనున్నట్టు తహసిల్దారు తెలిపారు.

అందరి చూపు.. 'గురుకులం' వైపు..

(5వ పేజీ తరువాయి)

అయితే రూ.1.5లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలకు మించి ఉండరాదు. సైనికోద్యోగుల పిల్లలకు ఆదాయ పరిమితి నిబంధనలు వర్తించవు. ప్రవేశ పరీక్ష 3, 4వ తరగతి స్థాయిలో తెలుగుకు 20 మార్కులు, ఇంగ్లీష్ 25, గణితం 25, మెంటల్ ఎబిలిటీ 10, పరిసరాల విజ్ఞానం 20 మార్కుల చొప్పున 100 మార్కుల ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు అంతకు ముందు తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. ఉదాహారణకు 8వ తరగతిలో సీటు కోసం దరఖాస్తు చేసుకునే వారు ప్రస్తుతం ఏడో తరగతి చదువుతుండాలి. అర్హులైన విద్యార్థులు (టీజీసెట్.సీజీజీ.జీవోవీ.ఇన్) ఆన్‌లైన్‌లో వివరాలతో దరఖాస్తు చేయాలి. ఇందుకోసం కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్ వివరాలతో ఆన్‌లైన్‌లో రూ.100ల పరీక్ష ఫీజుతో 2025, ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఫిబ్రవరి 23న నిర్వహించే ప్రవేశ పరీక్షకు 10 రోజుల ముందు నుంచి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది. ప్రవేశపరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్, స్థానికత, ప్రత్యేక కేటగిరీల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుంది.

జిల్లాలో 16 గురుకులాలు..

మహబూబాబాద్ జిల్లాలో సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో 16 గురుకుల పాఠశాలు ఉన్నాయి. జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల (ఎంజేపీటీ బీసీడబ్ల్యూఆర్)లు గుమ్మడూరు, కేసముద్రం, దంతాలపల్లి, గూడూరు, పెద్దవంగర, మరిపెడల్లో ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల (టీఎస్ డబ్ల్యూఆర్ఎస్)లు ఇనుగుర్తి, మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, నర్సింహులపేట, గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల(టీటీడబ్ల్యూఆర్ఎస్)లు మహబూబాబాద్, కేసముద్రం, మరిపెడ, కొత్తగూడ, దామరవంచ ప్రాంతాల్లో ఉన్నాయి. జిల్లాలోని 16 గురుకులాల్లో 5వ తరగతిలో 80 చొప్పున 1,280 సీట్లను భర్తీచేయనున్నారు. ఇవేగాక అన్ని గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీని కూడా ఇదే నోటిఫికేషన్‌లో చేపట్టారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం విద్యార్థులు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

అధికారంలో ఉన్నప్పుడు రైతులను మరిచారా?

● మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు రైతులు గుర్తుకు రాలేదా అని మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. ఎర్రవల్లి ఫాంహౌజ్ చుట్టు ఉన్న గ్రామాల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. అధికారం పోయాక రైతులపై కేటీఆర్‌కు ప్రేమ పెరిగి ధర్నాలు చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హయంలోనే అంబేద్కర్‌కు అవమానం జరిగింద న్నారు. కాంగ్రెస్‌పార్టీ కేవలం అంబేద్కర్ జయం తి, వర్ధంతి తప్ప ఏమి చేయలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు, జిల్లాప్రధాన కార్యదర్శులు మోసంగిమురళి, ధర్మారపు వెంకన్న, దార ఇందుభారతి, తుంపిళ్ల శ్రీను, సురేందర్, చెల్పూరి వెంకన్న, పట్టణాధ్యక్షులు వెన్నమల్ల అజయ్, జయేంద్రనాయక్, రమేష్, వెంకటేశ్వర్లు, గణేష్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, మల్లం యశ్వంత్, నరేష్, ఓర్సు పద్మావతి, రెహమాన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

డోర్నకల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మునిసిపల్ కార్యాలయం వద్ద సోమవారం పారిశుద్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. డోర్నకల్ పీఏసీఎస్ డైరెక్టర్ తవ్వ వరలక్ష్మి సొంత ఖర్చులతో సమకూర్చిన దుస్తులను మునిసిపల్ ఛైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్.ఛైర్మన్ కోటిలింగం చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. మునిసిపల్ కార్మికులకు వరలక్ష్మి దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. తన కుమారుడి వివాహం సందర్భంగా కార్మికులకు నూతన దుస్తులను అందించినట్లు వరలక్ష్మి చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్ పంపిణీ

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన సుంచ వెంకటేశ్వర్లుకు మంజూరైన రూ. 70వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను మంత్రి సీతక్క ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య సోమవారం కొత్తగూడలో అందజేశారు. ఈసందర్భంగా వజ్జ సారయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొల్లు రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు లావణ్య వెంకన్న, మండల నాయకులు దేశ్యా, తోలెం అనంతరావు పాల్గొన్నారు.

మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ

డోర్నకల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలో బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద రాజకీయ విధానాలను ప్రతి ప్రజాస్వామ్య వాది వ్యతిరేకించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న సోమవారం అన్నారు. డోర్నకల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 25 నుంచి సంగారెడ్డిలో జరుగనున్న సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభల జయప్రదం కోసం ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎం నాయకులు ఉప్పనపల్లి శ్రీనివాస్, బొమ్మన అశోక్, బొబ్బ వెంకటరెడ్డి, అన్నెగాని శ్రీనివాస్, పి.వెంకట్రాములు, బండారు మురళి పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా కో ఆర్డినేటర్‌గా బొల్లు రవి



రవియాదవ్

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యాదవ మహసభ సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన బొల్లు రవియాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగూడలో సోమవారం తెలంగాణ యాదవ మహసభ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజు బొల్లు రవియాదవ్‌కు నియామక పత్రం అందజేశారు. ఈసందర్బంగా బొల్లు రవియాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక సమావేశాల్లో లబ్ధిదారుల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శాంతి కుమార్

తొర్రూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వం నూతనంగా ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక చేపట్టనున్నట్లు మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ తెలిపారు. సోమవారం మునిసిపాలిటీలో లబ్ధిదారుల ఎంపికపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు తెల్లరేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా పథకాల్లో ఆయా వార్డుల్లో సమావేశాలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. ఇప్పటికే మునిసిపాలిటీ సిబ్బంది వార్డుల్లో అర్హులైన వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21న 1 నుంచి 4 వార్డు వరకు, 22న 5 నుంచి 8వ వార్డు వరకు, 23న 9 నుంచి 12వ వార్డు వరకు, 24న 13 నుంచి 16వ వార్డుల్లో ప్రత్యేక సమావేశాలు ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

గార్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముల్కనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు జీ కే ఎల్ ఫౌడేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీ కేఎల్ ఫౌడేషన్ నిర్వాహకులు మాట్లాడారు. సభ్యులు గుగులోత్ కౌసల్య, లక్ష్మణ్, హెచ్‌ఎం శ్రీనివాసులు, సిబ్బంది హతీరాం, గుగులోత్ జగన్, శ్రీనివాస్‌రెడ్డి, మేకల కృష్ణయ్య, సుబ్బారావు, మంగయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇనుగుర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలో ఇటీవలె మృతి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి నీలం వెంకన్న కుటుంబానికి సోమవారం గ్రామపార్టీ ఆధ్వర్యంలో రూ.34,200 ఆర్థిక సహాయాన్ని నాయకులు అందజేశారు. మాజీ సర్పంచ్ నీలం యాకయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపకరణాలకు 179 మంది దివ్యాంగులు ఎంపిక

మహబూబాబాద్ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో సోమవారం దివ్యాంగులకు ఉపకరణా లను అందించేందుకు ఎంపిక శిబిరాన్ని నిర్వహించినట్లు అలింకో సంస్థ ప్రతినిధులు రాజాబాబు, రస్మీ, రాజాశెట్టిలు తెలిపారు. జిల్లాలోని కేసముద్రం, నెల్లికుదురు, బయ్యారం, గార్ల, గూడూరు, మహబూబాబాద్ మండలాలకు చెందిన సుమారు 300 మందికి పైగా దివ్యాంగులు ఈ శిబిరానికి హాజరు కాగా, అందులో బ్యాటరీ ట్రైసైకిల్, వీల్‌ఛైర్‌లు, కృత్రిమ కాళ్లు, ఇతరత్రాపరికరాల కోసం 179 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. నేడు మరిపెడ ఇండోర్ స్టేడియంలో జరిగే శిబిరానికి దివ్యాంగులు హాజరై ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీవో శిరీష, జూనియర్ అసిస్టెంట్ వెంకన్న, బిక్షపతి పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రాధాన్యమివ్వాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కులాంతర, మతాంతర వివాహం చేసుకున్న నిరుపేదలకు ప్రాధాన్యత నివ్వాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఆర్డీవో కృష్ణవేణికి సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాంమూర్తి మాట్లాడుతూ... ఇంటి జాగ లేని వారికి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరీ చేయాలన్నారు. కులాంతర, మతాంతర వివాహం చేసకున్న వారి ఆర్థికాభ్యున్నతికి ప్రభుత్వం పాటు పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాగం రాంబాబు, చీపిరి యాకయ్య , పేరం సుభాష్, సురేష్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్ష బాధ్యతల అప్పగింత

కేసముద్రం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ కేసముద్రం మండల నూతన అధ్యక్షుడిగా ఇటీవలె నియామకమైన ఉప్పునూతల రమేష్‌కు ప్రస్తుత అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి సోమవారం స్థానిక గణపతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ బూత్‌స్థాయిలో పార్టీని మెరుగుపర్చి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ ఛైర్మన్ మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, వల్లభు వెంకటేశ్వర్లు, వోలం శ్రీనివాస్, రడం వెంకన్న, వేముల కొమ్మా లిరెడ్డి, పైండ్ల శ్రీనివాస్, రామడుగు వెంకటాచారి, గాంతి వెంకటరెడ్డి, బోగోజు నాగేశ్వరచారి, బోనగిరి ఉపెందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం.. దేహధారుడ్యం..

మరిపెడ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు దేహదారుద్యానికే కాకుండా స్నేహ బంధాలకు కూడా తోడుపడతాయని గిరిపురం ప్రముఖ రాజకీయ వేత్త కేఎల్ఎస్ఎన్ఎల్‌వీ శాస్త్రి, ప్రముఖ వ్యాపారవేత్త సోమకృష్ణలు అన్నారు. సోమవారం మండలంలోని గిరిపురంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 11 రోజుల నుంచి క్రికెట్ టోర్నమెంట్స్ జరుగుతున్నాయి. సోమవారం ఉల్లేపల్లి జట్టు, గిరిపురం టీంలకు ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. ఉల్లేపల్లి జట్టు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ చూపడంతో ఆ జట్టు విజేతగా నిలిచింది. ఉల్లేపల్లి జట్టుకు ప్రథమ బహుమతి రూ 10,116, గిరిపురం టీంకు ద్వితీయ బహుమతి రూ.5116, కూన్య తండా టీంకు తృతీయ బహుమతి రూ.3,116, మెమెంటో, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్‌లు అందజేశారు. సోమ శ్రీనివాస్, పట్ల మల్లయ్య, పట్ల వంశీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో యూరియా కొరత

డోర్నకల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో మండలంలో యూరియా కొరత ఏర్పడింది. సోమవారం ఉదయం డోర్నకల్ పీఏసీఎస్‌కు యూరియా వచ్చిందన్న విషయం తెలుసుకున్న రైతులు పెద్ద ఎత్తున అక్కడ బారులు తీరారు. ఒక్కొ రైతుకు మూడు బస్తాల చొప్పున యూరియాను పీఏసీఎస్ సిబ్బంది పంపిణీ చేశారు. తాము తెల్లవారు జామునే వచ్చి క్యూలైన్‌లో ఉండాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు యాసంగికి అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.



డోర్నకల్ పీఏసీఎస్ ఎదుట బారులుదీరిన రైతులు

జనవరి 26న మాంసం దుకాణాలు బంద్

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో జనవరి 26న గణతంత్ర్య దినోత్సవం రోజున జంతు వధ జరగకుండా మాంసం దుకాణాలను బంద్ చేయాలని స్థానిక మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చికెన్, మటన్ షాపు నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పెనాల్టీ విధించి షాపును సీజ్ చేస్తామని హెచ్చరించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కేసముద్రం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన మోరపాక ఉపెందర్(35) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్ఐ దీపిక సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన ప్రకారం...ఉపెందర్ కొన్నేళ్ళ క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి సుతారి పని చేస్తుండగా ఆయన భార్య కల్యాణి ఇళ్ళలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారంగా మారి ఆర్థిక ఇబ్బందులతో హైదరాబాద్ నుంచి ఈనెల 11న మహబూబాబాద్ మండలం రెడ్యాల సమీపానికి వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. అనంతరం అదే గ్రామంలోని తన బంధువుల ఇంటికి వెళ్లి విషయాన్ని తెలుపగా ఉపెందర్‌ను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించగా వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి ఉపెందర్ మృతి చెందాడు. ఆయనకు భార్య కల్యాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామ సభ నిర్వహణపై సమావేశం

దంతాలపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభ నిర్వహణపై సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తొర్రూరు ఆర్డీవో గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేస్తున్న గ్రామ సభలో తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. మండల ప్రత్యేక అధికారి బి.వీరన్న, ఎంపీడీవో వివేక్‌రాం, తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, గిర్దావర్ నజిముద్దిన్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దంతాలపల్లి మాజీ సర్పంచ్ కన్నుమూత



దంతాలపల్లి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన నాయిని రఘునందన్‌రెడ్డి సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు. నాయిని రఘునందన్‌రెడ్డి 1988లో జనరల్ స్థానంలో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తొలుత తెలుగుదేశం పార్టీలో క్రియాశీల పాత్రను పోషిస్తూ, కాంగ్రెస్ పార్టీలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడుగా, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడుగా పని చేస్తున్నారు. కొద్ది కాలంగా ఆయన అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయన పార్థీవ దేహాన్ని స్వస్థలం దంతాలపల్లికి తీసుకొచ్చారు. మంగళవారం అంత్యక్రియలు జరగనున్నాయి. రఘునందన్‌రెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి ఇటీవలే మృతి చెందారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించి , రోడ్డు ప్రమాదాలను నివారించాలని జిల్లా రవాణా శాఖ అధికారి టి. జైపాల్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రాతా మాసోత్సవాలను పురస్కరించకుని మహబూబాబాద్ పట్టణంలోని ఏకశిల ఏంజిల్స్ హైస్కూల్‌లో సోమవారం బస్సుడ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, ట్రెస్మా అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం

తొర్రూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ అన్నారు. సోమవారం తొర్రూరులోని పార్టీ కార్యాలయంలో సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ పోస్టర్‌లు ఆవిష్కరించి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం

కొత్తగూడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని చెరువుముందు తండాలో లచ్చిరాంకు చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు సోమవారం సాయంత్రం దగ్ధం అయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సాయంత్రం ఇంటి నుం చి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు కాలుతుండగా గ్రామస్తులు ఆర్పే ప్రయత్నం చేసేలోగా పూర్తిగా దగ్ధం అయింది. సుమారు రూ. 10వేల వరకు నష్టం జరిగినట్టు బాధితుడు లచ్చిరాం తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో క్రీడా, ముగ్గుల పోటీలు

కేసముద్రం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూసపల్లిలో సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా, ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆదివారం రాత్రి బహుమతులను విద్యుత్ శాఖ డీఈ విజయ్‌కుమార్, ఎస్ఐ మురళీధర్‌రాజ్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కుర్ర మహేష్, మండల అధ్యక్షుడు గొడిశాల వెంకన్న, మాద శ్రీను, మండల నాగమ్మ, తులసిమొగ్గ రాజశేఖర్, వెంకన్న, మునిత, మండ శ్రీనివాస్, గొర్రె వెంకన్న, రాచర్ల రాములు, నరేటి సత్తయ్య, కొమురయ్య, గాండ్ల యాదగిరి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మరిపెడ రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్జర్ల అమ్మ ఆదర్శ పాఠశాలలో చేసిన పనులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుంటే పాఠశాలకు తాళం వేస్తానని ఆ పాఠశాల కాంట్రాక్టర్ శ్యామల నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని ఎడ్జర్లలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం పాఠశాలలో టాయిలెట్, బాత్రూంలు, చిన్న చిన్న మైనర్ వర్కులకు సుమారు రూ.6 లక్షలు మంజూరయ్యాయన్నారు. రూ.6 లక్షల ఇతరుల వద్ద అప్పుగా తీసుకుని అదే సంవత్సరం జూన్ నెల వరకు పనులు పూర్తి చేశానన్నారు. కాగా, రూ.2లక్షల 15వేలు వచ్చాయన్నారు. సంవత్సరం అయినప్పటికీ మిగతా డబ్బులు ఇంతవరకు రాలేదన్నారు. బిల్లులు మంజూరు చేయని యెడల తాళం వేస్తానన్నారు.

గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలి

మరిపెడ, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మంగళవారం నుంచి జరిగే సంక్షేమ పథకాల ఎంపిక గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని మరిపెడ తహసీల్దార్ సైదులు అధికారులను ఆదేశించారు. సోమవారం మరిపెడ మండల్ పరిషత్ సమావేశ మందిరంలో వివిధశాఖల అధికారులు, గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన కో-ఆర్డినేషన్ సమావేశం జరిపి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ భరోసా, రేషన్ కార్డుల లబ్ధిదారులను గ్రామ సభ సెలక్ట్ చేసిన వ్యక్తులనే ఎంపిక చేయాలన్నారు. గ్రామాల వారిగా గ్రామ సభ షెడ్యూల్‌ను ప్రకటించారు.